## ఎల్‌టీఐమైండ్‌ట్రీ నూతన ఎండీగా వేణు



న్యూఢిల్లీ, మే 30: దేశీయ ఐటీ సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ సీఈవో ఎగ్జిక్యూటివ్, మేనేజింగ్ డైరెక్టర్ దేబాషిస్ చటర్జీ అనూహ్యంగా వ్యక్తిగత కారణాలతో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ప్రస్తుతం కంపెనీ సీఈవోగా విధులు నిర్వహిస్తున్న వేణు లంబు నూతన సీఈవో, ఎండీగా పదోన్నతి పొందారు. ఈ నియామకం శనివారం నుంచి అమలులోకి రానున్నట్లు కంపెనీ పేర్కొంది. 2019లో మైండ్‌ట్రీ సీఈవో, ఎండీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన చటర్జీ.. ఆ క్రమంలో మైండ్‌ట్రీ...ఎల్‌అండ్‌టీ ఇన్ఫోటెక్‌లో 2022లో విలీనమైంది.

# గోల్డ్ లోన్లు తీసుకునేవారికి ఊరట!

### రూ.2 లక్షలలోపు రుణగ్రహీతలకు మినహాయింపునివ్వండి

### ఆర్బీఐ నూతన మార్గదర్శకాలపై ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచన



న్యూఢిల్లీ, మే 30: బంగారం రుణాలపై రిజర్వుబ్యాంక్ ప్రతిపాదించిన కొత్త మార్గదర్శకాలపై ఆర్థిక మంత్రిత్వ శాఖ పలు సూచనలు చేసింది. బంగారం తాకట్టుపై రూ.2 లక్షలలోపు తీసుకునే రుణ గ్రహీతలకు ఈ మార్గదర్శకాల నుంచి మినహాయింపు నివ్వాలని సూచించింది. సెంట్రల్ బ్యాంక్ రూపొందించిన ఈ మార్గదర్శకాలపై దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతో వివరణ ఆర్థిక మంత్రిత్వ శాఖ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా తమిళనాడుకు చెందిన అన్ని రాజకీయ పార్టీలు ఈ ముసాయిదా మార్గదర్శకాలు చిన్నస్థాయి రుణ గ్రహీతలకు రుణాలు తీసుకోవడం కష్టతరంకానున్నదని కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన నేపథ్యంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ సూచన చేసింది. గత నెలలో ఆర్బీఐ పసిడి రుణాలపై ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. అందులో పసిడి తనఖా పెట్టుకొని ఇచ్చే రుణ విలువ, ఈ పసిడి విలువలో 75 శాతం కంటే మించరాదని పేర్కొంది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులకు రుణాలు లభించడం కష్టతరంకానున్నదని తమిళనాడు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో సెంట్రల్ బ్యాంక్ జారీ చేసిన ముసాయిదాను ఆర్థిక సేవల విభాగం పరిశీలించింది. చిన్న బంగారు రుణ గ్రహీతల అవసరాలపై ప్రభావం పడకుండా ఉండే కొత్త మార్గదర్శకాలను జారీ చేయాలని ఆర్బీఐకి సూచించింది. ఈ నూతన నిబంధనలు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి అమలులోకి రానున్నాయి. గత నెలలో జారీ చేసిన ముసాయిదా మార్గదర్శకాలపై భారీగా అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. దీంతో సెంట్రల్ బ్యాంక్ ప్రత్యేక దృష్టి సారించింది. పలువురు రాజకీయ పార్టీలు, ఆర్థిక విశ్లేషకుల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన ఆర్బీఐ..తుది మార్గదర్శకాలను మార్చివేయాలనుకుంటున్నది.

# అపోలో 8 వేల కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, మే 30: ప్రముఖ ఆసుపత్రుల నిర్వహణ సంస్థ అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.390 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.254 కోట్లతో పోలిస్తే 54 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.4,944 కోట్ల నుంచి రూ.5,592 కోట్లకు ఎగబాకినట్లు వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.21,794 కోట్ల ఆదాయంపై రూ.1,446 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసుకున్నది. ఈ సందర్భంగా అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి మాట్లాడుతూ..వచ్చే ఐదేండ్లలో రూ.8 వేల కోట్ల పెట్టుబడితో మరో 4,300 పడకలను ఏర్పాటు చేయబోతున్నట్లు, దీంట్లో తొలిదశలో 2 వేల పడకల అడ్వాన్స్ స్టేజ్‌లో ఉన్నాయన్నారు. దీంతోపాటు హైదరాబాద్, పుణె, కోల్‌కతా, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లలో ఏర్పాటు చేస్తున్న కేర్ టచ్‌పాయింట్లు, నూతన ఆసుపత్రులను ఈ ఏడాది అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. రోగులకు ప్రపంచస్థాయి చికిత్స అందించాలనే ఉద్దేశంతో నూతన మెడికల్ పరికరాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. మరోవైపు, గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతీ షేరుకు రూ.10 తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.



# పడేసిన ఐటీ, మెటల్ షేర్లు

### సెన్సెక్స్ 182, నిఫ్టీ 83 పాయింట్ల నష్టం

ముంబై, మే 30: దేశీయ స్టాక్ మార్కెట్లు మళ్లీ నష్టాలోకి జారుకున్నాయి. ఐటీ రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురికావడంతోపాటు ఆసియన్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మార్కెట్లను నష్టాల్లోకి నెట్టాయి. ప్రతీకార సుంకాల విధింపుపై అమెరికా కోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసినప్పటికీ అనిశ్చిత పరిస్థితి నెలకొనడం మదుపరుల్లో ఆందోళనను పెంచింది. తీవ్ర ఊగిసలాటల మధ్య ప్రారంభమైన సూచీలు మధ్యాహ్నం తర్వాత మరింత నష్టాల్లోకి జారుకున్నాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 182.01 పాయింట్లు కోల్పోయి 81,451.02 పాయింట్ల వద్ద ముగిసింది. ఒక దశలో 350 పాయింట్లకు పైగా నష్టపోయిన సూచీ చివర్లో ఈ నష్టాలను తగ్గించుకోగలిగింది. మరో సూచీ నిఫ్టీ 82.90 పాయింట్లు కోల్పోయి 24,750.70 వద్ద ముగిసింది. మెటల్, ఐటీ, వాహన రంగ షేర్లు పతనం చెందగా..కేవలం బ్యాంకింగ్ రంగ సూచీ లాభాల్లో ముగిసింది. టెక్ మహీంద్రా అత్యధికంగా 1.73 శాతం నష్టపోయింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీ 1.64 శాతం, ఏషియన్ పెయింట్స్ 1.62 శాతం, నెస్లె 1.52 శాతం, ఎన్‌టీపీసీ 1.49 శాతం, ఇన్ఫోసిస్ 1.43 శాతం, టాటాస్టీల్ 1.29 శాతం, సన్‌ఫార్మా 1.27 శాతం, పవర్‌గ్రిడ్ 1.13 శాతం చొప్పున నష్టపోయాయి. వీటితోపాటు టైటాన్, టీసీఎస్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటర్స్, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతి, కొటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, ఐటీసీ షేర్లు పతనం చెందాయి. కానీ, రిలయన్స్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ, ఎటర్నల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాల వారీగా చూస్తే మెటల్ 1.68 శాతం నష్టపోగా, ఐటీ 1.14 శాతం, టెక్నాలజీ, ఆటో, టెలికం రంగ షేర్లు నష్టపోగా..ఆర్థిక సేవలు, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి. మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 270, నిఫ్టీ 102 పాయింట్ల చొప్పున పతనం చెందాయి.

# వచ్చే నెలలో వన్స్‌మోర్

- రాబోయే ద్రవ్య సమీక్షలో రెపో మరో పావు శాతం కట్?
- ఆగస్టులోనూ ఇంకో 25 బేసిస్ పాయింట్లు డౌన్
- వచ్చే నెల 6న ఆర్బీఐ పాలసీ నిర్ణయం




ముమ్ముందూ వడ్డీరేట్ల కోతలే!

న్యూఢిల్లీ, మే 30: గత ఏడాదిదాకా వడ్డీ రేట్ల విషయంలో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ).. ఈ ఏడాది మొదలు తమ పాలసీని మార్చుకున్నది. ఈ క్రమంలోనే ఫిబ్రవరి, ఏప్రిల్ ద్రవ్య సమీక్షల్లో పావు శాతం (25 బేసిస్ పాయింట్లు) చొప్పున రెపో రేటును అర శాతం (50 బేసిస్ పాయింట్లు) తగ్గించింది. అయితే రాబోయే ద్రవ్య సమీక్షల్లోనూ ఆర్బీఐ ఇదే వైఖరిని ప్రదర్శించవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. జూన్, ఆగస్టుల్లో 25 బేసిస్ పాయింట్ల చొప్పున, మరో 50 బేసిస్ పాయింట్లు తగ్గవచ్చని అంటున్నారు. ప్రస్తుతం రెపో రేటు 6 శాతంగా ఉన్నది. నిజానికి కరోనా దెబ్బకు దిగాలుపడిన దేశ ఆర్థిక వ్యవస్థలో నూతనోత్తేజం నింపేందుకు వడ్డీరేట్లను అప్పటి ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వరుసగా తగ్గించుకుంటూపోయారు. అయితే పరిస్థితులు చక్కబడటం, ద్రవ్యోల్బణం విజృంభించడంతో తిరిగి పెంచుకుంటూపోయారు. ఫలితంగా 6.5 శాతానికి చేరింది. ఆ తర్వాత చాలాకాలం పాటు వడ్డీరేట్లు ఎక్కడివక్కడే ఉండిపోయాయి. కానీ దాస్ వెళ్తూవెళ్తూ వడ్డీరేట్లు ఇక తగ్గబోతున్నాయన్న సంకేతాలిచ్చారు. దీనికి తగ్గట్టుగానే కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆధ్వర్యంలో నిర్ణయాలు వెలువడుతున్నాయి.

### వృద్ధికి ఊతమిచ్చేలా..

అటు రిటైల్, ఇటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణాలు ఆర్బీఐ ఆమోదయోగ్య స్థాయిల్లోనే ఉండటంతో.. వడ్డీరేట్ల కోతలకే ఆర్బీఐ మొగ్గు చూపుతున్నది. ఈ తరుణంలో వృద్ధిరేటు నిరాశాజనకంగా ఉండటం.. మరింతగా వడ్డీరేట్ల తగ్గింపునకు అవకాశాలనిస్తున్నది. గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను దేశ జీడీపీ వృద్ధిరేటు నాలుగేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ 6.5 శాతంగానే నమోదు కావడం.. రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్ల కోతలకు మరింతగా ఆర్బీఐకి వీలు కల్పిస్తున్నట్టు చెప్తున్నారు. ఈ ఏడాది రెపో రేటు 5-5.25 శాతానికి దిగిరావచ్చన్న అంచనాల్ని కూడా నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు.. వాణిజ్య యుద్ధానికి దారి తీస్తుండటంతో ప్రధాన దేశాల రిజర్వ్ బ్యాంకులు వడ్డీరేట్ల కోతల దిశగానే అడుగులు వేస్తున్నాయి. అప్పుడే దేశ జీడీపీ వృద్ధికి బలం చేకూరగలదని భావిస్తున్నాయి. దీంతో భారత జీడీపీ వృద్ధి బలోపేతానికీ వడ్డీరేట్ల తగ్గింపులు ఉండవచ్చని అంటున్నారు. ఇక ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గిస్తే వాహన, నిర్మాణ రంగాలకు కొత్త ఉత్సాహం రాగలదని, రుణాలపై వడ్డీభారం తగ్గి ఈఎంఐలు దిగిరావచ్చని కూడా ఆయా వ్యాపార వర్గాలు ఆశిస్తున్నాయి. వాహన, గృహ రుణాలు చౌకగా మారితే అమ్మకాలు పెరుగుతాయని, అప్పుడు అన్నిరకాలుగా దేశ ఆర్థిక వ్యవస్థకూ కలిసొస్తుందని అంటున్నారు.

# ఆతిథ్యంపై అధిక పన్ను వద్దు

### ఇండియన్ హోటల్స్ ఎండీ పునీత్ చత్వాల్

న్యూఢిల్లీ, మే 30: ఆతిథ్య రంగంలో పన్నులు ఎక్కువగా విధిస్తున్నారని ఇండియన్ హోటల్స్ కంపెనీ లిమిటెడ్ ఎండీ, సీఈవో పునీత్ చత్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. విదేశీ పర్యాటకులను భారత్ విశేషంగా ఆకర్షించగలదని, అయితే అధిక పన్నులు ఈ అవకాశాన్ని దెబ్బతీస్తున్నాయని ఆయన ఒకింత ఆవేదన వెలిబుచ్చారు. దేశీయ ఆతిథ్య రంగంలో ప్రపంచస్థాయి బ్రాండ్ల రాకకు కూడా ఇది ఇబ్బందికరంగా మారిందన్నారు. ఇక్కడ జరిగిన సీఐఐ వార్షిక వ్యాపార సదస్సులో ఆయన మాట్లాడుతూ.. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఎక్సైజ్, ఇతర అన్ని చార్జీలను చెల్లించాల్సి వచ్చిందని, ఇలాగైతే గ్లోబల్ బ్రాండ్ల సృష్టి ఎలా ఉంటుందని ప్రశ్నించారు. దేశంలోని 50 పర్యాటక ప్రాంతాలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ హోదాను కల్పించాలని, ఆతిథ్య రంగానికి ఇండస్ట్రీ హోదా కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



### రూ.9,000 కోట్ల పెట్టుబడులు

భారతీయ ఆతిథ్య రంగంలోకి 2028కల్లా 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు రావచ్చని గ్లోబల్ కమర్షియల్ రియల్ ఎస్టేట్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ జేఎల్ఎల్ అంచనా వేస్తున్నది. శుక్రవారం విడుదల చేసిన ఓ నివేదికలో ఈ జనవరి-మార్చిలో రెవిన్యూ పర్ అవైలబుల్ రూమ్ నిరుడు ఇదే వ్యవధితో పోల్చితే 16.3 శాతం పెరిగిందని తెలిపింది. ఇక ఈ మూడు నెలల్లో 79 కొత్త హోటల్స్ అందుబాటులోకి వచ్చాయని, 9,478 గదులున్నాయని పేర్కొన్నది. బెంగళూరులో హోటల్స్‌కు డిమాండ్ బాగా ఉన్నదని వివరించింది.

# జియోకు పెరిగిన కస్టమర్లు

హైదరాబాద్, మే 30: రిలయన్స్ జియో తెలుగు రాష్ట్రాల్లో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం..ఏప్రిల్ చివరి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో జియో నెట్‌వర్క్‌లోకి కొత్తగా 95,310 సబ్‌స్క్రైబర్లు జతయ్యారని తెలిపింది. దీంతో మొత్తం కస్టమర్ల సంఖ్య 3,18,71,384కి చేరుకున్నారు. ఇదే సమయంలో తన పోటీ సంస్థ ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను 42,600 మంది ఎంచుకోగా, బీఎస్ఎన్ఎల్ 1,715 సబ్‌స్క్రైబర్లు చేరారు. కానీ వొడాఫోన్ ఐడియా 9,058 మంది కస్టమర్లను కోల్పోయింది.






ధర రూ.3.43 లక్షలు

# కవాసాకి నింజా 300 బైకు

న్యూఢిల్లీ, మే 30: స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ కవాసాకి..దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. దేశీయంగా నింజా మాడళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని నింజా 300ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మాడల్ ధర రూ.3.43 లక్షలుగా నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ఉన్న కంపెనీ అవుట్‌లెట్ల వద్ద బుకింగ్ చేసుకున్న కస్టమర్లు వచ్చే నెల మొదటి వారం నుంచి డెలివరి చేయనున్నట్లు పేర్కొంది.

# బొమ్మలపై పిచ్చి వ్యామోహం!

### బ్రెజిల్‌లో వింత పరిస్థితి



శావో పాలో(బ్రెజిల్), మే 30: జీవం ఉట్టిపడేలా ఉండే చంటి పిల్లల బొమ్మల కోసం ప్రజలలో ఏర్పడిన వ్యామోహం బ్రెజిల్‌లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అచ్చంగా పిల్లలను పోలిన బొమ్మలతో పెద్దలు, పిల్లలు అనే తేడా లేకుండా ప్రజలు భావోద్వేగాన్ని ప్రదర్శిస్తూ ప్రేమను పంచుతున్న వీడియోలు దేశమంతా వైరల్ అవుతున్నాయి. కొందరు శాసనకర్తలు సైతం చట్టసభలకు ఆ బొమ్మలను తమ వెంట తీసుకురావడం సంచలనం సృష్టించింది. చేత్తో తయారు చేసిన బొమ్మల చేత అప్పుడే పుట్టిన బిడ్డలాగా అనుకరణ చేస్తూ, షాపింగ్ మాల్స్‌తో బొమ్మలతో షికారు చేస్తూ యూట్యూబర్లు తీసిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక రియో డీ జనీరో నగర కౌన్సిల్ అయితే మరో అడుగు ముందుకేసి జీవం ఉట్టిపడేలా ఉండే బొమ్మలు తయారు చేసే వారిని సత్కరిస్తామని కూడా ప్రకటించింది. అయితే ఈ ప్రతిపాదన మేయర్ వద్ద పెండింగ్‌లో ఉంది. ఇక బొమ్మలపై పిచ్చి ప్రేమ ఏ స్థాయికి చేరిందంటే ఓ మహిళ బొమ్మతో దవాఖానలోకి వెళుతున్న వీడియో సంచలనంగా మారింది. దీనిపై స్పందించిన ప్రజా ప్రతినిధులు కొందరు అటువంటి బొమ్మలకు వైద్య సహాయం కోరుతున్న వారికి జరిమానాలు విధించాలని డిమాండు చేశారు. మంగళవారం అమేజోనాస్‌కు చెందిన ఓ ప్రజా ప్రతినిధి ఓ బొమ్మతో చట్టసభలోకి ప్రవేశించారు. ప్రభుత్వ దవాఖానలలో బొమ్మలకు చికిత్స అందచేయడంపై నిషేధం విధించాలని కోరడానికే తాను ఈ బొమ్మను తెచ్చానని ఆయన చెప్పారు. అయితే బొమ్మలకు చికిత్స అందచేసే పరిస్థితి ప్రభుత్వ వైద్యులకు ఇప్పటివరకు రాలేదని అధికారులను ఉటంకిస్తూ మీడియా కథనాలు స్పష్టం చేశాయి. కాగా, తన సహచరులు బొమ్మలకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని పార్లమెంట్ సభ్యురాలు తలీరియా పెట్రోనె గత వారం విమర్శించారు. అసలు సమస్యలను వదిలేసి ఈ బొమ్మల పిచ్చేమిటని ఆమె ప్రశ్నించారు. తనకు ఇద్దరు నిజమైన పిల్లలు న్నారని, వారితోనే తనకు సమయం సరిపోవడం లేదని ఆమె తెలిపారు. శావో పాలోలోని విల్లా లోబోస్ పార్కులో పెద్ద సంఖ్యలో ఈ "అమ్మ కాని అమ్మలు" సమావేశం కావడం విశేషం. కాబోయే తల్లులు పిల్లల పెంపకం అలవాటు చేసుకునేందుకు ఈ బొమ్మలు ఉపయోగపడుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. భావోద్వేగంలో ఉన్నపుడు ఈ బొమ్మలు తనకు ఉపశమనం కలిగిస్తాయని 8 బొమ్మలను తన వద్ద ఉంచుకున్న బెరెనైస్ మరియా అనే నర్సింగ్ అసిస్టెంట్ వెల్లడించారు. తన షాపులో 124 డాలర్ల(రూ. 10,500) నుంచి 1,800 డాలర్ల(రూ. 1.50 లక్షలు) ఖరీదు చేసే బొమ్మలను అమ్ముతున్నట్లు యజమాని దానియల్ బక్కన్ తెలిపాడు. బొమ్మలపై వివాదం రాజుకోవడంతో ప్రజల మానసిక ఆరోగ్యంపై కూడా ఆందోళన పెరుగుతోంది.

### స్క్రిప్స్ స్పెల్లింగ్ బీ విజేతగా

# ఇండియన్ అమెరికన్ విద్యార్థి

### రూ.42 లక్షల ప్రైజ్‌మనీ సొంతం చేసుకున్న ఫైజల్ జకీ



న్యూయార్క్, మే 30: అమెరికాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ విజేతగా హైదరాబాద్ మూలాలున్న ఇండియన్ అమెరికన్ విద్యార్థి ఫైజన్ జకీ (13) నిలిచాడు. గురువారం రాత్రి జరిగిన 2025 స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీలో "eclaricissement" అనే పదాన్ని ఉచ్చారణ దోషం లేకుండా సరిగ్గా పలికినందుకు జకీ ఈ పరీక్షలో విజేతగా నిలిచాడు. జకీ తాత హైదరాబాద్ నుంచి ప్రత్యక్ష ప్రసారంలో ఈ పరీక్షను వీక్షించారు. ప్రతిష్ఠాత్మక ఈ పోటీ పరీక్షలో భారతీయ-అమెరికన్ విద్యార్థుల సత్తా ఈ ఏడాది కూడా కొనసాగడం విశేషం. తనతో పోటీపడిన సర్వదన్య కదంపై టెక్సాస్‌లోని సీఎం రైస్ మిడిల్ స్కూలులో 7వ తరగతి చదువుతున్న జకీ విజయం సాధించాడు. 2024లో రెండవ స్థానంలో నిలిచాడు. ఈ పరీక్షలో జకీ పాల్గొనడం ఇది నాలుగో సారి. ఈ ఏడాది విజేతగా నిలిచిన జకీకి స్క్రిప్స్ నుంచి 50,000 డాలర్ల (రూ. 42.77 లక్షలు) నగదు బహుమతి, ఓ మెడల్, ట్రోఫీ లభిస్తాయి.

# ఇజ్రాయెల్‌తో అంటకాగుతారా?

- విద్యార్థులు స్వేచ్ఛా పాలస్తీనాను కోరుకుంటున్నారు
- ఎంఐటీలో ఇండో అమెరికన్ విద్యార్థిని మేఘా వేమూరి సంచలన ప్రసంగం



మసాచుసెట్స్, మే 30: ఒక వైపు పాలస్తీనా అనుకూల వైఖరితో వ్యవహరించే విద్యార్థులపై ట్రంప్ ప్రభుత్వం కక్షగట్టి దేశ బహిష్కరణ విధిస్తున్న క్రమంలో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) గ్రాడ్యుయేషన్ డేలో భారత సంతతికి చెందిన మేఘా వేమూరి చేసిన ప్రారంభ ప్రసంగం సంచలనం సృష్టించింది. ఎంఐటీ క్లాస్ 2025 అధ్యక్షురాలు అయిన మేఘా వేమూరి పాలస్తీనా సంఘీభావానికి ప్రతీక అయిన కెఫియే ధరించి ప్రసంగం చేశారు. ఇజ్రాయెల్‌తో విశ్వవిద్యాలయ సంబంధాలను ఆమె తన ప్రసంగంలో నిశితంగా విమర్శించారు. ఎంఐటీ విద్యార్థులు స్వేచ్ఛ పాలస్తీనాను కోరుకుంటున్నారని పేర్కొనడమే కాక, మారణ హోమానికి పాల్పడుతున్న ఇజ్రాయెల్‌తో ఎంఐటీ యూనివర్సిటీ ఒప్పందం కుదుర్చుకోవడమేమిటని ఆమె ప్రశ్నించింది. పాలస్తీనా ప్రజలకు ఎంఐటీ విద్యార్థులు అండగా నిలవడాన్ని ఆమె ప్రశంసిస్తూ మారణహోమాన్ని తామెంతమాత్రం సహించమని హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో సంబంధాలు తెంపుకోవడానికి విద్యార్థులు ఇటీవల చూపుతున్న చొరవను ఆమె ప్రశంసించారు. 'మీరు గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు పిలుపునిచ్చారు. క్యాంపస్‌లో పాలస్తీనా అనుకూల కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. మీరు అన్ని దిశల నుంచి, ముఖ్యంగా మీ సొంత విద్యాలయ అధికారుల నుంచి బెదిరింపులు, అణచివేతను ఎదుర్కొన్నారు. కానీ మీరు విజయం సాధించారు' అని ఆమె విద్యార్థులను ప్రశంసించారు. తనకు తెలిసి ఎంఐటీ సంఘం ఎన్నడూ మారణహోమాన్ని సహించదని ఆమె పేర్కొన్నారు.

# అడ్వాన్స్ టిప్ దోపిడీనే!

- ఓలా, ఉబర్, ర్యాపిడోల్లపై దర్యాప్తు
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ వెల్లడి
- ముందుగా టిప్ ఇవ్వాలని కోరడాన్ని తప్పుబడుతున్న కస్టమర్లు
- నిజంగా డ్రైవర్లకే వెళ్తున్నదా? కంపెనీలు కొట్టేస్తున్నాయా? అని సందేహం




న్యూఢిల్లీ: ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి రైడ్ హెయిలింగ్ కంపెనీల యాప్‌లపై కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ (సీసీపీఏ) దర్యాప్తు చేస్తున్నదని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ చెప్పారు. సత్వర సేవల కోసం ముందుగానే టిప్‌ను చెల్లించాలని కస్టమర్లను బలవంతపెట్టడం లేదా సుతిమెత్తగా కోరడం అనైతికమని, దోపిడీతో కూడుకున్నదని స్పష్టం చేశారు. ఇటువంటి చర్యలు అనుచిత వ్యాపార పద్ధతుల కిందికి వస్తాయన్నారు. టిప్ అంటే ప్రశంసాపూర్వకంగా ఇచ్చేదని, సేవకు ముందస్తు షరతు కాదని తెలిపారు.

### టిప్ ఇస్తే డ్రైవర్లు వేగంగా అంగీకరిస్తారు

డ్రైవర్లకు ముందుగానే టిప్ ఇస్తే, రైడ్‌ను అంగీకరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఉబర్ చెప్తున్నది. ర్యాపిడో, ఓలా క్యాబ్స్ కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. వేగంగా రైడ్ దొరకాలంటే అదనంగా చెల్లించాలని యూజర్లకు చెప్తున్నాయి.

### అడ్వాన్స్ టిప్పింగ్ ఎలా మొదలైంది?

కర్ణాటక ప్రభుత్వ రంగంలోని నమ్మ యాత్రి యాప్ 2022లో ఈ విధానాన్ని ప్రారంభించింది. దీనిని ర్యాపిడో 2023లో అనుసరించింది. ఉబర్ ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదలుపెట్టింది. నమ్మ యాత్రి యాప్‌లో 'టిప్‌ను కలపండి' అని చెప్పడానికి బదులుగా, 'మరింత కలపండి (స్వచ్ఛందం)' అని పేర్కొంది. అంటే, అడ్వాన్స్ టిప్పింగ్ కస్టమర్ ఇష్టాన్ని బట్టి ఉంటుందని, స్వచ్ఛందంగా ఇస్తే ఇవ్వవచ్చునని అర్థం వచ్చేలా యాప్‌ను రూపొందించింది. కానీ వాస్తవంగా క్యాబ్‌లను అప్పటికప్పుడు బుక్ చేసుకోవలసి ఉంటుంది కాబట్టి, అడ్వాన్స్ టిప్పింగ్ స్వచ్ఛందం కాబోదు. ఎందుకంటే, 'నేను ఇవ్వకపోతే, మరొకరు ఇచ్చేసి, క్యాబ్‌ను బుక్ చేసేసుకుంటారు' అనే భయం కస్టమర్లకు ఉంటుంది.

### యూజర్లు ఏమంటున్నారు?

కస్టమర్లు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ఫిర్యాదులు చేస్తున్నారు. అడ్వాన్స్ టిప్ కుంభకోణం నమ్మ యాత్రి నుంచి మొదలైందని, ఈ వైరస్ ఉబర్, ర్యాపిడోలకు పాకిందని మండిపడుతున్నారు. మెరుగైన సేవల ముసుగులో ముందుగానే అదనంగా చెల్లించాలని కోరడం పట్టపగలు చేసే దోపిడీ అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫీచర్ రావడానికి పూర్వం రైడ్ బుకింగ్ సునాయాసంగా జరిగేదని, ర్యాపిడో, ఉబర్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ టిప్ నిజంగానే డ్రైవర్లకు వెళ్తున్నదా? కంపెనీ కొంత వాటా కొట్టేస్తున్నదా? అని కొందరు సందేహం వ్యక్తం చేస్తున్నారు.



# ఎన్‌డీఏలో నారీశక్తి

- తొలిసారిగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా క్యాడెట్లు
- పుణెలో ఘనంగా స్నాతకోత్సవం

ముంబై, మే 30( నమస్తే తెలంగాణ): నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)లో శిక్షణ పూర్తి చేసుకుని భారత సైన్యంలో చేరనున్న మొదటి బ్యాచ్ మహిళల స్నాతకోత్సవ కార్యక్రమం శుక్రవారం పుణె ఖడక్ వాసలలోని ఎన్‌డీఏలోని ఖేత్రపాల్ మైదానంలో ఉత్సాహంగా జరిగింది. ఈ స్నాతకోత్సవం ప్రత్యేకమైనది. ఎందుకంటే 75 ఏండ్లలో తొలిసారిగా ఎన్డీఏలో మహిళలు శిక్షణ పూర్తి చేసుకుని సైన్యంలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మిజోరం గవర్నర్, మాజీ ఆర్మీ చీఫ్ వీకే సింగ్, ఆర్మీ సదరన్ కమాండ్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో గవర్నర్ వీకే సింగ్ మాట్లాడుతూ, మొదటిసారిగా మహిళలు ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకోవడం దేశానికి గర్వకారణమని, వారి అంకితభావం, క్రమశిక్షణకు దేశం గర్విస్తున్నదని అన్నారు.

# 'ఉగ్రవాదులకు సంతాపమా?'

బొగోటా: 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో కొలంబియా అనుసరించిన విధానాన్ని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తీవ్రంగా ఎండగట్టారు. పహల్గాం ఉగ్ర దాడి అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యంలో అఖిల పక్ష బృందాలు వివిధ దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. భారత దేశంపైకి ఉగ్రవాదులను పాకిస్థాన్ ఎగదోస్తున్న తీరును, ఉగ్రవాదంపై భారత్ విధానాన్ని ఈ బృందాలు వివరిస్తున్నాయి. శశి థరూర్ నేతృత్వంలోని బృందం గురువారం కొలంబియాలో పర్యటించింది. బొగోటాలో జరిగిన మీడియా సమావేశంలో శశి థరూర్ మాట్లాడుతూ, ఉగ్రవాదంపై భారత్ విధానం, 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించారు.


## దక్షిణ మధ్య రైల్వే

Follow us on @SCRailwayIndia

ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

**ప్రొఫార్మా 10-1**
**బహిరంగ ప్రకటన**

దక్షిణ మధ్య రైల్వేలో దిగువ తెలిపిన సెక్షన్‌లో పూర్తి చేయబడిన సెక్షన్‌లోగల రైల్వే లైన్లు మరియు ఆవరణలు వినియోగించు వారందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా సదరు సెక్షన్‌లో 25000వోల్ట్, 50Hz, A.C. ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లలో సదరు తేదీన లేదా ఆ తరువాత విద్యుత్ సరఫరా జరుగుతుంది. సదరు తేదీన మరియు సదరు తేదీ నుండి అన్నివేళలా ఓవర్‌హెడ్ ట్రాక్షన్ లైన్‌లో విద్యుత్ ప్రవహిస్తున్నట్లుగా భావించాలి మరియు అనధీకృత వ్యక్తి ఎవరూ కూడా సదరు ఓవర్‌హెడ్ లైన్ సమీపంలోకి ప్రవేశించరాదు లేదా పని చేయరాదు.

| సెక్షన్ | తేది |
| --- | --- |
| సికింద్రాబాద్ డివిజన్‌లో PDPL-NZB సెక్షన్‌లో OHE మాస్ట్ లొకేషన్ KRLA/1109 (KM/CH: 103/165.35) నుండి లొకేషన్ KRLA/1015 (KM/CH: 103/747.00) వరకు కోరుట్ల స్టేషన్ వద్ద బల్లాస్ట్ సైడింగ్ (జోన్ ఎ మరియు జోన్ బి) విద్యుదీకరణ. | 30.05.2025 |

A0785 సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TrD/సికింద్రాబాద్


# ఫోన్ టార్చ్ వెలుతురులో నలుగురికి ప్రసవం

డబుల్ ట్రబుల్ ఇంజిన్

లక్నో, మే 30: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని విద్యుత్ సరఫరా, ప్రభుత్వ దవాఖానాల్లో మౌలిక వసతులు ఎంత అధ్వానంగా ఉన్నాయో తెలిపే ఉదంతమిది! విద్యుత్తు కోతల వల్ల బలియా జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మొబైల్ టార్చ్‌లైట్ వెలుతురులో నలుగురు మహిళలు ప్రసవించిన సంగతి వెలుగులోకి వచ్చింది. సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ దెబ్బతినటంతో విద్యుత్తు సరఫరా ఆగిపోయిందని తెలిసింది. ఇదే జిల్లాలో కొద్ది రోజుల క్రితం ఓ ఆరోగ్య కేంద్రం మెట్లమీదే ఓ గర్భిణి ప్రసవించటం రాష్ట్రంలో సంచలనం రేపింది. రాష్ట్రంలో విద్యుత్తు కోతలు, ప్రజారోగ్య కేంద్రాల్లో అధ్వాన పరిస్థితులకు ఈ ఘటనలు అద్దం పడుతున్నాయని సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. తాజా ఘటనపై బాలియా వైద్య అధికారి డాక్టర్ సంజీవ్ బర్మన్ మాట్లాడుతూ, 'బెరువార్ బారీ పీహెచ్‌సీ ఇన్‌చార్జ్, ఇతర అధికారుల నుంచి వివరణ కోరాం. జెనరేటర్ కూడా మంచి కండీషన్‌లోనే ఉంది. ఈ ఘటన జరగటంపై విచారణకు ఆదేశించాం' అని అన్నారు.

### రెండు తుర్కియే విమానాలకు

# మరో మూడు నెలల లీజు పొడిగింపు

ఇండిగోకు అనుమతి ఇచ్చిన డీజీసీఏ

ముంబై,: టర్కీ ఎయిర్‌లైన్స్ విమానాలను మరో మూడు నెలలు నడపడానికి లీజును పొడిగిస్తూ డీజీసీఏ శుక్రవారం ఇండిగోకు అనుమతినిచ్చింది. ఇండిగో లీజుకు తీసుకున్న రెండు బోయింగ్ 777 విమానాలను ఆగస్టు 31 వరకు నిర్వహించుకోవచ్చునని, ఇదే ఆఖరి పొడిగింపు అని, అంతేకాకుండా మూడు నెలల్లోగా టర్కీ ఎయిర్‌లైన్స్‌తో సంబంధాలను రద్దు చేసుకోవాలని ఆదేశించింది. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఈ చర్య తీసుకున్నట్టు డీజీసీఏ తెలిపింది. ఇటీవల భారత్-పాక్ మధ్య చోటుచేసుకున్న దాడుల్లో పాక్‌కు తుర్కియే మద్దతిచ్చింది.